# పుస్తక పరిచయం




**సుద్దాల అశోక్‌తేజగారి** కలం నుంచి వెలువడిన ఈ 'శ్రమకావ్యం' ఒక వజ్రాయుధం, ఒక రామబాణం, ఒక కల్పవృక్షం .. వెరసి ఇదొక విశిష్టప్రయోగం. ప్రయోజనకరమైన ప్రయోగం. అశోక్‌తేజగారు కేవలం గేయరచయితో, సినిమా పాటల రచయితో మాత్రమే కాదు, ఆయనొక వైజ్ఞానిక కవి అని విస్పష్టంగా తెలియచేసే మహత్తర గ్రంథం ఈ శ్రమకావ్యం. సృష్టికి మూలం శ్రమ. మానవజాతి ప్రగతికి మూలం శ్రమ. శ్రమ లేని మానవపరిణామాన్ని ఊహించుకోలేము. రామాయణం కంటే ముందే శ్రమాయణం ఉందనీ, సామవేదం కంటే ముందే శ్రామవేదం ఉండి ఉండాలనీ, అన్ని మతాలకంటే ముందే ఏకైక, శ్రమైక మతం ఉండితీరాలి అనీ - ప్రతిపాదించి, నిరూపించారు కవి అశోక్‌తేజగారు. శ్రమి, శ్రముడు అనే రెండు పాత్రల ద్వారా, వాళ్ళ శ్రమ ద్వారా మానవజాతి ఎలా ఎదిగిందో అచ్చమైన కవిత్వంలో విశదీకరించారు అశోక్‌తేజగారు. నాలుగుకాళ్ళ దశ నుంచీ రెండు కాళ్ళ మనిషిగా రూపాంతరం చెంది, మాటనీ, నడకనీ, పరుగునీ నేర్చుకుని, అవసరాల కోసం వివిధ ఉపకరణాలని ఆవిష్కరించుకుని, కళలకూ ఊపిరి పోసుకుని - ఆదిమ కాలం నుంచీ ఆధునిక కాలం ద్వారా మానవుడు ఎలా ఎదిగాడు అనే పరిణామ క్రమాన్ని శ్రమకావ్య రూపంలో కవి వర్ణించిన విధానం అద్భుతం, అనితరసాధ్యం. ఇది కేవలం విజ్ఞానశాస్త్ర గ్రంథం కాదు, కేవలం కవితా ధారా కాదు.. ఈ రెండూ సమపాళ్ళలో కలిసిన భౌతిక వాద వైజ్ఞానిక కావ్యం. శ్రమలో కూడా భౌతిక శ్రమ, మానసిక శ్రమ ఉంటాయని విశదపరచిన కవి, మానవప్రగతిలో ఆ రెండింటి ప్రభావాన్నీ ప్రతి అధ్యాయంలోనూ విశదీకరించారు. ఆయన మాటల్లోనే ' శ్రామ ఆది / శ్రమ మధ్య / శ్రమ ఆదిమధ్యాంతాతీతముగ / దిగ్దిగంతముల నాక్రమించిన / శ్రమ విక్రమాకృతిని నేను కీర్తిస్తున్నాను! '. ముందుమాటలో గొల్లపూడిగారు చెప్పినట్లు 'సుద్దాల అశోక్ తేజ' అనే అభినవ డార్విన్ మానవుని స్వభావ పరిణామాన్ని ఆపోశన పట్టి సహేతుకంగా ఉదహరిస్తూ కలల ఉయ్యాలల్లో ఆ దశల్ని ఊరేగిస్తూ ఒక మిస్టిక్ అనుభూతికి తెరతీశాడు'. ఈ శ్రమకావ్యం మనసు మూలల్ని స్పృశిస్తుంది, మెదడుపొరల్ని తట్టిలేపుతుంది. ఈ కావ్యం చదువుతున్నంత సేపూ పాఠకులు ఒక సరికొత్తలోకంలో విహరిస్తారు, సరికొత్త అనుభూతికి లోనవుతారు. ఈ కావ్యరచనతో అశోక్ తేజగారు తెలుగు కవితా ప్రపంచంలో ఒక అగ్రపీఠాన్ని అధిరోహించారు.!

***

**For Copies:**

*Nava Chetana Book House*
*PrajaShakti Book House*
*Nava Telangana Book House*




**అమెరికా** ప్రవాసాంధ్ర రచయిత్రులలో తనకంటూ ఒక విభిన్నమైన రచనా ప్రక్రియని ఎన్నుకుని ఆ దిశలో సంవత్సరాలుగా రచనలు చేస్తున్న రచయిత్రి శ్యామలాదేవి దశికగారు. ఈ విలక్షణమైన సాహితీ ప్రక్రియే - సొంత గొంతుకతో ఓ అమెరికా ఇల్లాలు చెప్పుకునే సరదాలు, సాధింపులూ, సలహాలు, సన్నివేశాలు!! సరళమైన వాక్యాలు, ఏమాత్రం సంక్లిష్టత లేని భావ వ్యక్తీకరణ, అతి చిన్న సంఘటనలని కూడా చక్కటి గల్పికగా మార్చగల చతురత ఈ రచయిత్రి అభ్యాసం చేసి, సొంతం చేసుకున్న రచనా లక్షణాలు. వీటిని కథా సంపుటి అన్నారు కానీ నిజానికి వీటిని గల్పికల సమాహారం అంటే బావుటుందేమో.. ఒక్కోసారి ప్రహసనాల్లా కూడా అనిపిస్తాయి. ఏమి చెప్పినా, ఎలా చెప్పినా - వ్యంగ్యం, సున్నితత్వం, మనసుని తాకే గుణం, ఒక్కోసారి హృదయాన్ని తడిచేసే కరుణరసం - ఈ రచనల్లోని ప్రత్యేకత. ఈ గల్పికల్లోని అమెరికా ఇల్లాలు మరీ అల్ట్రా మోడర్న్ కాదు, అలాగని ఇంట్లోనే మడిగట్టుకుని కూర్చునే ఛాందసవాదీ కాదు, సమయాని సందర్భానికీ తగినట్లు తనని తాను మలచుకుంటూ, స్పందించగల సమర్థవంతమైన ఇల్లాలు - ఈ అమెరికా ఇల్లాలు. మంచితనం, మమతలూ, అనుబంధాలూ మనుషుల్ని కలుపుతూ ఎదగాలనుకునే మంచి మనసున్న ఇల్లాలు - ఈ అమెరికా ఇల్లాలు. ఈ ఇల్లాలు సంభాషణల్లో సూపర్ ఊతపదం, సెల్ ఫోన్, ప్లాస్టిక్ బ్యాగు, బరువు, హెల్తీ ఫుడ్.. ఏ అంశం గురించైనా ఆసక్తికరమైన ప్రసంగం చెయ్యగలదు. ఆమె ప్రసంగానికి ప్రత్యక్ష శ్రోత ఆ ఇల్లాలిగారి భర్తే ఐనా పరోక్షంగా మనందరం శ్రోతలమే, ప్రేక్షకులమే. ఇందులోని గల్పికలు ఎప్పుడు ఎక్కడనుంచి చదవడం మొదలుపెట్టినా రచనా శైలి అలా అలవోకగా మనల్ని తనతో తీసుకెళ్తుంది. అందులో భాగమైన పాత్రల్లో చాలాసార్లు మన కుటుంబసభ్యులూ, మన కుటుంబ బంధాలూ ప్రతిబింబిస్తూ ఉంటాయి. ఇలా వ్రాయడంలోనే శ్యామలగారు రచయిత్రిగా ఎంతో విజయం సాధించారు. అమెరికా ఇల్లాలి ముచ్చట్లు మొదటి భాగం కొన్ని సంవత్సరాల క్రిందట వచ్చింది. దానికి కొనసాగింపు, రెండో భాగం ఈ పుస్తకం. ఏ రచన ఐనా పాఠకులకు చేరువకావడమే పరమావధి, ఆ దృష్ట్యా ఈ పుస్తకం దాచుకుని మరీ అప్పుడప్పుడూ చదువుకోవాల్సిన పుస్తకం.

****

**Published By:**
**Vanguri Foundation of America**
**PO Box 1948, Stafford**
**TX – 77497**
**Phone: 832 594 9054**
**vangurifoundation@gmail.com**

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**